

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 21.0



రంజాన్ వేళలు
ఇఫ్తార్(బుధవారం)-6:31
సహెర్ (గురువారం)-5:04

భయం.. అప్రమత్తం

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పని చేస్తున్న సహాయక బృందాల పరిస్థితి ఇది..
- ఐదు స్టేజీల్లో 150 హెచ్‌పీ పంపులతో నీరు బయటకు తోడివేత
- 11వ కిలోమీటర్ వద్ద కన్వేయర్ బెల్టు ఇంటర్ ఛేంజ్ స్టేషన్..
- లోకోలో 13 కిలోమీటర్లు చేరుకోవాలంటే గంటన్నర సమయంపైనే..
- ప్రమాదం రోజుతో పోల్చితే చాలా దూరం మెరుగైన రవాణా వ్యవస్థ
- ఎయిర్ బ్లోయర్ ద్వారానే లోపల పనిచేస్తున్న వారికి ఆక్సిజన్ సరఫరా
- ఒక్కో సర్కిల్‌లో 15 టన్నుల బరువైన ఏడు సెగ్మెంట్ బ్లాకుల అమరిక
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రయాణంలో ఆంధ్రజ్యోతి పరిశీలన



ఆంధ్రజ్యోతి గ్రౌండ్ రిపోర్ట్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపలికి కెడావర్ డాగ్స్‌తో వెళ్తున్న కేరళ పోలీసులు



నీటిని తోడేందుకు ఏర్పాటు చేసిన భారీ మోటార్లు



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల భారీగా ఊబికి వస్తున్న ఊట

మహబూబ్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం.. ప్రపంచంలోనే అయిదో అత్యంత పెద్దది. మొత్తం 43.93 కిలోమీటర్ల దూరం తవ్వాల్సిన ఈ టన్నెల్‌లో ఇప్పటివరకు ఇన్‌లెట్, ఔట్‌లెట్‌వైపు కలిపి 34.37 కిలోమీటర్లు పూర్తయ్యింది. ఇంకా 9.56 కిలోమీటర్లు మాత్రమే తవ్వాలి. ఔట్‌లెట్ వైపు ఉన్న టీబీఎం మరమ్మతునకు గురికాగా, ఇన్‌లెట్ వైపు టీబీఎం పనులు చేస్తుండగా.. గత నెలలో పైకప్పు కూలింది. దీంతో అక్కడ 8 మంది కార్మికులు ఇరుక్కుపోయారు. అందులో ఒకరి మృతదేహాన్ని ఆదివారం బయటకు తీశారు. ఇంకా ఏడుగురి ఆచూకీ కోసం 12 ఏజెన్సీలకు చెందిన సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి. అయితే టన్నెల్ ప్రమాద స్థలం వద్ద ముందు కంటే మెరుగైన పరిస్థితులు, రవాణా వ్యవస్థ ఉండగా.. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో లోకో ట్రెయిన్‌లో 13.65 కిలోమీటర్ వరకు వెళ్లి టన్నెల్ పరిస్థితి, సహాయక చర్యల తీరు, లోపల ప్రమాద స్థలాన్ని పరిశీలన చేసింది. ఉదయం 11:35 గంటలకు ఈ ప్రయాణం ప్రారంభం కాగా.. 3 గంటలకు 'ఆంధ్రజ్యోతి' బృందం మళ్లీ టన్నెల్ బయటకు వచ్చింది. ఈ టన్నెల్‌లో పరిశీలించిన విషయాలు పాఠకుల కోసం...

ఐదు స్టేజీల్లో డీవాటరింగ్..

టన్నెల్ ప్రమాదం జరిగిన స్థలం నుంచి బయట వరకు దాదాపు 13.9 కిలోమీటర్ల దూరం ఉంది. లోపల ఊబికి వస్తున్న నీటిని బయటకు తరలించకపోతే పనులు చేయడం కష్టం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న దూరానికి దాదాపు ఐదు స్టేజీల్లో

(మిగతా 6లో..)

ఆందోళనలో.. ఆర్డీఎస్ రైతులు

- పంటలు చేతికందే సమయంలో నిలిచిన సాగునీరు
- మూడు రోజుల క్రితమే తుమ్మిళ్ల లిఫ్ట్ బంద్
- ఇండెంట్ పెట్టి ఆరు రోజులైనా పూర్తిస్థాయిలో రాని నీరు
- టీబీ డ్యామ్‌లో పూర్తిస్థాయిలో తెలంగాణ వాటా వినియోగం
- పంటలు చేతికందాలంటే మరో 2 టీఎంసీలు అవసరం



మేడికొండ శివారులో నీరందక వాడుబట్టిన మొక్కజొన్న పంట

యాసంగిలో ఆర్డీఎస్ పరిధిలో సాగుచేసిన కంది, మొక్కజొన్న, వేరుశనగ, వరి, జొన్న, సజ్జ పంటలు పూర్తిస్థాయిలో చేతికందాలంటే ఈ నెల చివరి వరకు సాగునీరు పారించాలి. ఈ పంటలన్నీ ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. 2024 డిసెంబరు మొదటి వారంలో జిల్లా ఇరిగేషన్ అధికారులు ఆర్డీఎస్ పరిధిలో 37 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించడంతో డీ-12 నుంచి డీ-34 వరకు ఆర్డీఎస్ కింద రైతులు వివిధ రకాల పంటలు సాగుచేసుకున్నారు. కానీ, నేడు నీరందక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజులు సాగునీరు అందితే తప్ప పంటలు చేతికందే పరిస్థితి కనిపించడం లేదని కన్నీరుపెడుతున్నారు.

- అయిజటౌన్, ఆంధ్రజ్యోతి



డీ-16 వద్ద ఆర్డీఎస్ ప్రధానకాలువలో అడుగంటిన నీటి ప్రవాహం

6

పందుల దొంగల అరెస్టు

- నలుగురికి రిమాండ్
- ఒక బొలెరో వాహనం, రూ.90వేలు స్వాధీనం
- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైం, మార్చి11 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా వనపర్తి జిల్లాలో పందులను దొంగతనం చేస్తున్న ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు పట్టణంలోని పరమేశ్వర స్వామి చెరువు కట్ట సమీపంలో చెన్నయ్య అనే వ్యక్తి పందులను పెంచుకుంటున్నాడు. ఫిబ్రవరి 16వ తేదీన ఆత్మకూరు చెరువు కట్ట సమీపంలో బ్రిడ్జి వద్ద నిందితులు బింగిదొడ్డి అంజి, మహేష్, నందవరం బాలరాజు అనే ముగ్గురు వ్యక్తులు రెక్కీ నిర్వహించారు. ఈ ముగ్గురు అక్కడ పందులు ఉన్నట్లు ఎరుకలి భీమన్న, సుంకన్నలకు సమాచారాన్ని చేరవేశారు. ఆ మరుసటి రోజు17వ తేదీన పందులను దొంగతనం చేసేందుకు ఎరుకలి సిద్దప్ప బొలెరో వాహనంలో ఎరుకలి అంజి, ఎరుకలి నాగరాజు, ఎరుకల భీమన్న, నాగరాజు, సుంకన్న, మహేశ్, అంజిలతో కలిసి రాత్రి సమయంలో ఆత్మకూరులోని పందుల షెడ్డు వద్దకు చేరుకున్నారు. 30 పందులను బొలెరో వాహనంలో ఎక్కిస్తుండగా అక్కడే కాపలా ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎవరు అని నిలదీశారు. అప్పటికే బొలెరో వాహనంలో ఉన్నవారు గాజు సీసాలు, రాళ్లతో దాడిచేశారు. అలాగే బాధితుల వద్ద ఉన్న సెల్ ఫోన్లను లాక్కొని జూరాల డ్యాంలో పడేశారు. సిద్దప్ప మిగతా నిందితులను ఎమ్మిగనూరు వద్ద వదిలిపెట్టి బెంగళూరు వెళ్లి రూ.90 వేలకు పందులను అమ్ముకున్నాడు. ఈ విషయంపై బాధితుల ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్పీ సూచన మేరకు డీఎస్పీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్, అమరచింత ఎస్ఐ సురేశ్ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో మళ్లీ దొంగతనం చేసేందుకు అమరచింత వైపు వెళ్తుండగా పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో చేసిన దొంగతనాలతో పాటు ఆత్మకూరు దొంగతనానికి సంబంధించి నేరం ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఎరుకలి సిద్దప్ప, ఎరుకలి అంజి, ఎరుకలి నాగరాజు, ఎరుకలి అంజి, ఎరుకలి భీమన్న, ఎరుకలి నాగరాజు, సుంకన్న, మహేశ్, బాలరాజు, సతీశ్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సుంకన్న, మహేష్‌లు పరారీలో ఉన్నారని, మరో నలుగురు వేరే కేసులో అలంపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఇంకో నలుగురిని ప్రస్తుతం ఈ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. వీరి నుంచి ఒక బొలెరో వాహనం, రూ.90 వేలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ, అదనపు ఎస్పీ ఉమా మహేశ్వరరావు, ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐలు నరేందర్, సురేష్ పాల్గొన్నారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

- 8 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు
- జడ్చర్ల పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఘటన
- జోగులాంబ గద్వాల జిల్లాలో మరో ఘటన

7

అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు

- ఒకే కుటుంబంలో నలుగురి మృతి
- ముకురాలలో విషాదఛాయలు
- నివాళులర్పించిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

6

సర్కారు బడిలో ఏఐ పాఠాలు

- నారాయణపేట జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం
- ఎంపిక చేసిన పది పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

7



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి11 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్య క్రమం ద్వారా నాట్కో ఫార్మా ట్రస్టు వారి సహకారంతో టీబీ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వనపర్తిని టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని అన్నారు. ఇందుకోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. క్షయ వ్యాధి సోకిన వారు ఆరు నెలలు క్రమం తప్పకుండా పోషకాహారం, వైద్యులు సూచించిన మందులు తీసుకుంటే నయమవుతుందని తెలిపారు. రోగులందరికీ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన నాట్కో ట్రస్టు వారికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, వైద్య, ఆరోగ్య శాఖ టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ రాజేశం, నాట్కో ఫార్మా ట్రస్టు సీఎస్ఆర్‌హెడ్ మధన్, టీబీ కన్సల్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 ఫలితాల్లో నల్లమల యువతి ప్రతిభ

- రాష్ట్రంలో 15వ ర్యాంకు సాధించిన మద్దెల శైలజ

అచ్చంపేటటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 పరీక్ష ఫలితాల్లో 370 మార్కులతో నల్లమల ప్రాంతానికి చెందిన మాజీ ఎంపీపీ కుమార్తె మద్దెల శైలజ రాష్ట్రంలో 15వ ర్యాంకు సాధించింది. కాంగ్రెస్ నాయకులు కాశన్న యాదవ్, ఆంజనేయులుతో పాటు పలువురు ఆమెను మంగళవారం శాలువాతో సత్కరించారు. జోగుళాంబ గద్వాల జోన్‌లో మొదటి ర్యాంకు సాధించింది.



శైలజను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మంటల్లో పడి వృద్ధురాలి మృతి

- అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు



చెన్నమ్మ (ఫైల్)

గద్వాల క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కొన్నకొడుకులు, కూతురు ఉన్నా ఒంటరిగా జీవిస్తున్న ఓ వృద్ధురాలు మంటల్లో కాలి మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మోమిన్‌మొహల్లా కాలనీకి చెందిన చెన్నమ్మ(85)కు నలుగురు కుమారులు, ఓ కూతురు సంతానం. ఇద్దరు కుమారులు చనిపోగా ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీరందరికీ వివాహాలు జరిగాయి. అయితే ఇద్దరు కొడుకులకు కొంతకాలంగా తమకు భారంగా భావించి మోమిన్‌మొహల్లా కాలనీలో శిథిలావస్థలో ఉన్న సొంత ఇంటిలో తల్లిని ఉంచి, వారు మాత్రం రాఘవేంద్రకాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రతీ రోజు ఎప్పుడో ఒక సమయంలో కాస్త భోజనం పంపేవారని కాలనీవాసులు తెలిపారు. అంతేకాక ఆ చేనేత వృద్ధురాలు తన పిల్లలు భోజనం పంపని సమయంలో సమీపంలో ఉన్న అంధుల ఆశ్రమ పాఠశాలలో భోజనం చేస్తుండేదని స్థానికులు తెలిపారు. అయితే మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి కాలుతున్న వాసన రావడాన్ని గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాము వచ్చేసరికే వృద్ధురాలు మంటల్లో పూర్తిగా కాలిపోయిందని పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఉదయం ఆమె కన్నకొడుకే ఇంటికి వచ్చి వెళ్లాడని, అతడిపైనే కాలనీవాసులు అనుమానం వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ టీ శ్రీను పరిశీలించారు. మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు చేశాడని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే మృతిపై వస్తున్న అనుమానాలను పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

అసైన్డ్ భూములు గిరిజనులకు దక్కాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



రెడ్య తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్

ఊర్కొండ/నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములు గిరిజనులకు దక్కాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం గుండ్లగుంటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్యతండా పరిసరాల్లో సర్వే నంబరు 186లో 109 ఎకరాల భూమి ఉంది. గత ప్రభుత్వం కొంతమేరకు అనర్హులకు కేటాయించడంతో వారు తండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని జాతీయ ఎస్టీ కమిషన్‌కు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన తండాను సందర్శించారు. అనంతరం రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తండా పరిసరాల్లో ఉన్న అసైన్డ్ భూముల్లో గిరిజనులు తాత ముత్తాతల కాలం నుంచి సేద్యం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. తండా ప్రజల హక్కులను కాలరాసేవిధంగా ఏ అధికారి ప్రయత్నం చేసినా చూస్తూ ఊరుకునేదిలేదని హెచ్చరించారు. గతంలో ఇచ్చిన అసైన్డ్ పట్టాదారులు ఎక్కడ కాస్తులో లేరని, అలా ఉంటే న్యాయం చేస్తామని, అధికారులు నెలరోజుల్లో సర్వే చేయడంతో పాటు గిరిజనులకు అండగా ఉండాలని అన్నారు. అక్రమంగా పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వేయర్ల ద్వారా హద్దులు గుర్తిస్తామని ఆర్డీవో శ్రీను తెలిపారు. స్వాధీనంలో ఉన్న పట్టాదారులను గుర్తించడంతో పాటు, వారికి ఏవిధంగా సంక్రమించిందో రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ పట్టణంలోని మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన 'యువ ఉత్సవ్' కార్యక్రమాన్ని హుస్సేన్ నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన మెడికల్ కళాశాల విద్యార్థులకు ఆయన మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో తహసీల్దార్ రామ్ కోటి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకురాలు గౌసియా పాల్గొన్నారు.

పీయూలో 27, 28 తేదీల్లో
రాష్ట్రస్థాయి వర్క్‌షాప్



వర్క్‌షాప్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, అధ్యాపకులు

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలోని ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 27, 28న రిసెర్చ్ మెథడాలజీ మరియు ప్రాజెక్ట్ వర్క్ అనే అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప తెలిపారు. మంగళవారం వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అధ్యాపకులకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అధ్యాపకులు డాక్టర్ నాగసుధ, డాక్టర్ ఎస్ఎన్ అర్జున్‌కుమార్, డాక్టర్ జావేద్‌ఖాన్, డాక్టర్ గాలెన్న, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

స్పౌజ్ బదిలీల అక్రమాలపై విచారించాలి

» గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్‌లో ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ ద్వారా ఇటీవలే జరిగిన జీవో నెంబరు 317, జీవో నెంబరు 2 డీఎస్‌ఈ స్పౌజ్ బదిలీల్లో అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజిపేట మండలం గొరిట ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న శ్వేత, నందిని అనే ఇద్దరు ఎస్‌జీటీ ఉపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారులు కుమ్మక్కై వారి స్పౌజ్‌లు మహబూబ్‌నగర్ జిల్లాలో పని చేయకున్నా అక్రమంగా బదిలీలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పౌజ్ బదిలీల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి అందుకు కారకులైన నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌తో పాటు బదిలీల ఎంఈవో భాస్కర్‌రెడ్డి, జీహెచ్‌ఎం రాజశేఖర్‌రావు, వెంకటేశ్వర్‌శెట్టిలను సర్వీస్ రిమూవ్ చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బంజార గిరిజన సమాఖ్య రాష్ట్ర ఇన్‌చార్జి సంతోష్‌రాథోడ్, ఎన్ఎస్‌యూఐ పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షుడు వంశీ, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నాయకులు శోభన్‌బాబు, నాగరాజు ఉన్నారు.

మహిళలను వేధిస్తే ఆట కట్టిస్తాం

- జిల్లా షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి వెల్లడి



ముష్టిపల్లిలో హైస్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి

పెద్దకొత్తపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులను, అబలలను ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే అలాంటి వారిని ఆట కట్టిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీం, భరోసా గురించి మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ మధ్య కాలంలో ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఇన్‌స్టాగ్రామ్ పరిచయాల ఆకర్షణకు గురై మోసపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తున్నారని విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే ధైర్యంగా ముందుకొచ్చి తమకు ఫిర్యాదు చేయాలని విజయలక్ష్మి అన్నారు. ఎవ్వరైనా బాధితులు 100లేదా 8712657676 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలపాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేఖ, షీటీమ్ మెంబరు వెంకటయ్య, స్కూల్ టీచర్స్ విద్యార్థులు, భరోసా షీటీం మెంబర్లు జ్యోతి, రాధిక పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన కేంద్ర బృందం



ఆసుపత్రిని పరిశీలించిన సెంట్రల్ టీం

అచ్చంపేటటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం కేంద్రబృందం పరిశీలించింది. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలతో పాటు కల్పిస్తున్న వసతి, సౌకర్యాలు, పచ్చదనం పరిశుభ్రత, పారిశుధ్యం నిర్వహణ అంశాలతో ఆసుపత్రిలో ఉపయోగిస్తున్న పరికరాల నాణ్యత గురించి పరిశీలించారు. రోగులకు అందిస్తున్న చికిత్స పద్ధతుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగు లకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. కేంద్ర బృందం అధికారి శైలజకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ఆసుపత్రికి రోగులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బిక్కు నాయక్, సిబ్బంది శంకర్, శ్రీరాం, పాల్గొన్నారు.

అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు

» ఒకే కుటుంబంలో నలుగురి మృతితో ముకురాలలో విషాదఛాయలు

» నివాళులర్పించిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, రోధిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

కల్వకుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో పిల్లలకు విషమిచ్చి చంపి తాము ఉరివేసుకున్న దంపతులు కే చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన భార్య కవిత, పిల్లలు సీత, విశ్వంత్‌ల అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో జరిగాయి. హైదరాబాద్‌లోని అప్పుల బాధతో ఈ కుటుంబం బలి కావడంతో వారి స్వగ్రామమైన ముకురాలలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం నాలుగు మృతదేహాలను స్వగ్రామం ముకురాలకు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, పలువురు నాయకులు తరలివచ్చి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇలాంటి సంఘటన ఈ ప్రాంతంలో జరగడం తీవ్ర విషాదాన్ని నింపిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి సూసైడ్ నోట్‌లో తమ చావుకు ఎవరూ కారణం కాదని కేరీర్, మానసికంగా సమస్యలు ఎదుర్కొంటూ చనిపోతున్నామని పేర్కొన్నారు. కుటుంబం మొత్తం బలి కావడంతో గ్రామస్థులను తీవ్ర మనోవేదనకు గురి చేసింది.

ఆందోళనలో ఆర్‌డీఎస్ రైతులు



» పంటలు చేతికందే సమయంలో నిలిచిన సాగునీరు

» మూడు రోజుల క్రితమే తుమ్మిళ్ల లిఫ్ట్ బంద్

» పంటలు చేతికందాలంటే మరో 2 టీఎంసీల నీరు అవసరం

అయిజటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పంటకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందని ఆర్‌డీఎస్ పరిధిలోని రైతులు విరివిగా పంటలు సాగుచేశారు. 2024 డిసెంబరు మొదటి వారంలో జిల్లా ఇరిగేషన్ అధికారులు ఆర్‌డీఎస్ పరిధిలో 37 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. దీంతో రైతులకు సాగునీరు సమృద్ధిగా అందుతుందనే నమ్మకం ఏర్పడింది. డీ-12 నుంచి డీ-34 వరకు ఆర్‌డీఎస్ కింద రైతులు వివిధ రకాల పంటలు సాగుచేసుకున్నారు.

టీబీ డ్యామ్‌లో యాసంగి సాగునీటి వాటా ఇలా..

ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిసినందున కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేట్ వద్ద ఉన్న టీబీ డ్యామ్‌లో పూర్తిస్థాయిలో సాగునీరు నిల్వ ఉంది. యాసంగి పంటకు గానూ డ్యామ్ నుంచి తెలంగాణ వాటాగా 5.87 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ వాటాకు గానూ 7 టీఎంసీలు సాగునీరు వాడుకునే అవకాశం ఏర్పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు టీబీ డ్యామ్ నుంచి ఆర్‌డీఎస్‌కు విడుదల చేసే సాగునీటిని కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లా ఇరిగేషన్ అధికారులు 60:40 నిష్పత్తిలో ఇండెంట్‌పెట్టి సాగునీరు విడుదల చేసుకునేవారు. నేడు ఆంధ్రప్రదేశ్ అధికారులు ఉమ్మడి ఇండెంట్‌పెట్టేందుకు తెలంగాణ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించడం లేదనే వాదనలు ఉన్నాయి. ఒక వేళ కలిపి ఇండెంట్ పెట్టినా సుంకేసుల వద్ద నుంచి తమకు రావలసిన వాటాను ఎప్పటికప్పుడు వాడుకోవటంతో తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద ఉండాల్సిన 292.5 అడుగుల సామర్థ్యం తగ్గి ఆర్‌డీఎస్ డీ-23 నుంచి డీ-34 వరకు సాగునీరు అందటం ఇబ్బందిగా మారుతోంది. మూడు రోజులుగా తుమ్మిళ్ల లిఫ్ట్ మోటర్లు బంద్ కావటంతో రైతులు సాగునీరు అందక అల్లాడుతున్నారు.

ఈ నెల చివరివరకు పారితేనే ప్రయోజనం

ఆర్‌డీఎస్ పరిధిలో రైతులు వేసుకున్న యాసంగి పంటలు పూర్తిస్థాయిలో చేతికందాలంటే ఈ నెల చివరి వరకు సాగునీరు అందాల్సిన పరిస్థితి ఉంది. కంది, మొక్కజొన్న, వేరుశనగ, వరి, జొన్న, సజ్జ తదితర పంటలను సాగుచేసుకున్నారు. ఈ పంటలన్నీ ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. మరో నెల రోజులు సాగునీరు అందితే తప్ప పంటలు చేతికందని పరిస్థితి ఉంది. ఈ నెల 5వ తేదీన పెట్టిన ఇండెంట్ సాగునీరు డిస్ట్రిబ్యూటర్ 18, 20 వరకు కూడా అందే అవకాశాలు కనిపించటం లేదు. ఇక తుమ్మిళ్ల లిఫ్ట్ అయితే ఈ ఇండెంట్ వాటాకు ఆన్ అవుతుందన్న నమ్మకం లేదు. డీ-34 వరకు ఉన్న రైతులు చేతికందే పంట ఎండుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రాష్ట్రాల అధికారులు మాట్లాడితే ప్రయోజనం

ఆర్‌డీఎస్‌కు మరో నెల రోజులు సాగునీరు అందితేనే రైతులకు పంటలు చేతికందే పరిస్థితులు ఉన్నాయి. కానీ తెలంగాణకు ఉన్న వాటా మొత్తం ఈ నెల 13వ తేదీతో పూర్తవుతుంది. కర్ణాటకలోని టీబీ డ్యామ్‌లో ఈ ఏడాది గతంలో కంటే కొంతమేర ఎక్కువగానే నీరు నిల్వ ఉంది. మంగళవారం నాటికి టీబీ డ్యామ్‌లో 24 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఏబీ) అనుమతితో అదనంగా తెలంగాణకు 2 టీఎంసీలు కేటాయించుకోగలిగితే ఆర్‌డీఎస్ పరిధిలోని రైతులందరి పంటలు చేతికందే అవకాశం ఉంటుంది.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నాగులదిన్నె వద్ద నీరులేక అడుగంటిన తుంగభద్ర నది

చివరి దశలో పంటలు కాపాడాలి



ఆర్‌డీఎస్ పరిధిలో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందే దశలో ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. వారం రోజులుగా ఆర్‌డీఎస్ కాలువలో నీటి పారుదల నిలిచి పోయింది. పొట్టదశలో కొన్ని కంకులు ఏర్పడిన దశలో మరికొన్ని పంటలు ఉన్నాయి. కనీసం వారానికి ఒక తడి అయినా రెండు, మూడు తడులు పెట్టుకుంటే పంటలు చేతికందుతాయి. 3 ఎకరాల్లో మొక్క జొన్న పంట వేశాను. పండుతుందో, ఎండుతుందో అని భయమేస్తోంది.

- బుగ్గన్న, రైతు తనగల గ్రామం, వడ్డేపల్లి మండలం

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం



ఆర్‌డీఎస్ రైతులకు తెలంగాణ వాటాగా అందే సాగునీరు ఈనెల 13తో పూర్తవుతుంది. కానీ మరో నెల రోజులు నీరు పారితేనే రైతులకు పంటలు చేతికందుతాయి. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం దృష్టికి ఆర్‌డీఎస్ రైతుల పరిస్థితిని తీసుకుపోతాం. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి కనీసం 2 టీఎంసీలు విడుదల చేయించుకుంటే పంటలన్నీ పండే అవకాశం ఉన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలకు వివరిస్తాం.

- సీతారామిరెడ్డి, ఆర్‌డీఎస్ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్

అన్ని టీఎంసీల నీరు వాడుకున్నాం



ఆర్‌డీఎస్ పరిధిలోని రైతుల యాసంగి పంటకు ఇప్పటికే 5.87 టీఎంసీల సాగునీరు వాడుకున్నాం. రైతుల పంటలు చాలా వరకు చివరి దశలో ఉన్నాయి. ఈ నెల 5న, పెట్టిన ఇండెంట్ సాగునీరు మంగళవారం నాటికి తెలంగాణ పరిధిలోకి వస్తుంది. 13వ తేదీ వరకు ఈ ఇండెంట్ సాగునీరు రైతులకు అందుతోంది. డీ-12 నుంచి డీ-34 వరకు 37 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని ప్రకటించినా డీ-40 వరకు సాగునీరు పారింది.

- విజయ్‌కుమార్ రెడ్డి, ఆర్‌డీఎస్ ఈఈ, గద్వాల

ఇండెంట్ పెట్టి ఆరు రోజులైనా

ఆర్‌డీఎస్ రైతులకు పంటలు చేతికందే సమయంలో పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ నెల 5వ, తేదీన తెలంగాణ వాటాగా రోజుకు 1,500 క్యూసెక్కులు, ఆంధ్రప్రదేశ్ వాటాగా రోజుకు 2,500 క్యూసెక్కుల సాగునీరు విడుదలకు అధికారులు ఇండెంట్ పెట్టారు. కానీ మంగళవారం మధ్యాహ్నం నాటికి తెలంగాణ పరిధిలోని డీ-16 వరకు చుక్కనీరు చేరుకోలేదు. వాస్తవంగా కర్ణాటకలోని రాజోళిబండ ఆనకట్ట వద్ద 8.5 అడుగులు పారితే తెలంగాణ పరిధిలోని డీ-12 వద్ద 2.5 అడుగుల నీరు కాలువలో పారుతుంది. ఇక డీ-34 వరకు ఈ రెండున్నర అడుగుల నీరు పారుతుందా అంటే డీ-16 వరకే పారి బందయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆనకట్ట వద్ద మంగళవారం నాటికి 7.7 అడుగుల మేర నీరు ఉండటంతో సాగునీటి పారుదలలో ఆలస్యం అవుతుంది. ఈ నెల 13వ తేదీలోపల ఈ ఇండెంట్ వాటా నీరు కూడా ముగుస్తుంది. దీంతో తెలంగాణకు రావల్సిన 5.87 టీఎంసీల వాటా పూర్తికాగా, ఆంధ్రప్రదేశ్‌కు రావల్సిన 7 టీఎంసీలలో 5 టీఎంసీలు పూర్తవుతాయి. తీరా ఇండెంట్ పెట్టాలన్నా టీబీ డ్యామ్‌లో ఒక్కచుక్క తెలంగాణ వాటా సాగునీరు లేదు. ఆంధ్రప్రదేశ్ వాటా మాత్రం ఇంకా 2 టీఎంసీలు మిగులు ఉంటుంది.

భయం.. అప్రమత్తం..



టన్నెల్ లోపలే భోజనాలు చేస్తున్న రెస్క్యూ సిబ్బంది




సొరంగంలో అమర్చిన భారీ సెగ్మెంట్లు

(5వ పేజీ తరువాయి)

డీవాటరింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో స్టేజీలో 150 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న రెండు పంపులను వినియోగిస్తున్నారు. ఒక పంపు ద్వారా అక్కడ ఏర్పాటు చేసిన ట్యాంకులో నీరు దూకితే.. మరో పంపు ఆ ట్యాంకులో నుంచి నీటిని మరో స్టేషన్‌కు తరలిస్తుంది. పని జరుగుతున్న ప్రాంతంలో మాత్రం ఒకటి నీటిని పీల్చుకోవడానికి.. మరొకటి పీల్చుకున్న నీటిని తరలించడానికి ఉపయోగిస్తున్నారు. టన్నెల్‌లో ప్రస్తుతం నిమిషానికి 5వేల లీటర్ల నీరు ఉబికి వస్తోంది. అంతే మొత్తంలో నీటిని బయటకు తరలిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు 11 కిలోమీటర్ల వరకు బురదనీరు పేరుకునే ఉండగా, ఇప్పుడు 13.65 కిలోమీటర్ల వరకు కూడా పంపింగ్ చేసుకునే అవకాశం ఉంది.

ఎయిర్ బ్లోయర్ ప్రధానం..



సొరంగంలో ఆక్సిజన్ కోసం తీసుకొచ్చిన సిలిండర్లు

సాధారణంగా అత్యంత లోతుకు వెళ్లినా.. అత్యంత ఎత్తుకు వెళ్లినా గాలి పీడనంలో మార్పులు రావడం సహజం. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూడా అంతే. దాదాపు 13.9 కిలోమీటర్ల దూరంలో వందల మంది కార్మికులు నిత్యం షిఫ్టుల వారీగా పని చేస్తారు. వారికి కావాల్సిన ప్రాణ వాయువు లోపల ఉండదు. ఒకవేళ కొంత ఉన్నా.. అది పని చేయడానికి అత్యంత ప్రమాదకరం. అందుకే టన్నెల్ బయట నుంచే ఎయిర్ బ్లోయర్ ద్వారా లోపలకు ఆక్సీజన్ సరఫరా చేస్తారు. లోపల ఆటోమేటిక్‌గా పీడనం ఎక్కువై.. టన్నెల్ ద్వారా మళ్లీ బయటకు ఎగ్జాస్ట్ అవుతుంది.

ఒక్కో సర్కిల్‌లో.. ఏడు సెగ్మెంట్ బ్లాకులు..

డీబీఎం (డ్రిల్లింగ్&బ్లాస్టింగ్) పద్ధతిలోనైతే.. టన్నెల్ తవ్వుతున్నా కొద్దీ పైభాగంతోపాటు పక్కభాగాలు కూడా కూలకుండా కాంక్రీట్ వేయడం, రాక్‌బోల్టింగ్ చేస్తుంటారు. కానీ టీబీఎం ద్వారా చేస్తున్న టన్నెల్‌లో మరో విధానం పాలో అవుతారు. సర్కిల్ డయాలో ఈ సొరంగం ఉంటుంది. ఎస్ఎల్‌బీసీ సొరంగం 10 మీటర్ల డయా కాగా.. టీబీఎం తవ్వుతూ వెళ్తున్నా కొద్దీ కప్పు కూలకుండా.. ఉండేందుకు సెగ్మెంట్ బ్లాకులను అమరుస్తారు. ఇది కూడా టీబీఎం చేసుకుంటుంది. సెగ్మెంట్ బ్లాకులను మాత్రం బయట తయారుచేసి లోపలకు తరలిస్తారు. ఒక్కోసారి సర్కిల్ పూర్తికావాలంటే 15 టన్నుల బరువున్న ఏడు సెగ్మెంట్ బ్లాకులు అవసరమవుతాయి. అవి టన్నెల్ కూలకుండా రక్షణగా ఉంటాయి.

కన్వేయర్ ఇంటర్‌ఛేంజ్ స్టేషన్..



కన్వేయర్ బెల్టు

టీబీఎం మిషన్ తవ్వుతున్నా కొద్దీ వచ్చే శకలాలను, వ్యర్థాలను కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తారు. టీబీఎం కట్టర్ భాగం తొలుస్తున్నా కొద్దీ, టీబీఎంలోనే ఉండే కన్వేయర్ ద్వారా ప్రాసెస్ అవుతూ.. బయటి కన్వేయర్ బెల్టుపై వేస్తారు. ఆ తర్వాత కన్వేయర్ బెల్టు ఆ మట్టిని, బురదను, వ్యర్థాలను బయటకు తరలిస్తుంది. అయితే దూరం ఎక్కువ కావడంతో ఒకే స్టేషన్ ద్వారా బెల్టు వేగంగా రన్ కావడం సాధ్యం కాదు. అందుకే 11వ కిలోమీటర్ వద్ద ఒక ఇంటర్ ఛేంజ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ ముందు నుంచి వస్తున్న మట్టి.. ఈ స్టేషన్‌లో మరో బెల్టుపై పడుతుంది. టన్నెల్ బయట కూడా పైకి తరలించడానికి ఒక స్టేషన్ ఉంది.

2.50 కిలోమీటర్ల వరకు క్లియర్...:



టన్నెల్‌లో ఎక్స్‌కవేటర్‌తో చేపడుతున్న తవ్వకం పనులు

గత నెల 22న ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రభావానికి టీబీఎం ముక్కలుగా మారి.. ముందుకు రావడంతో పాటు మట్టి, బురద, నీరు దాదాపుగా 11వ కిలోమీటర్ వరకు కొట్టుకొచ్చింది. మొదట లోపలకు వెళ్లిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు కేవలం 11వ కిలోమీటర్ వద్దకు మాత్రమే లోకోలో వెళ్లగలిగారు. ప్రస్తుతం మట్టి, వ్యర్థాలను పూర్తిస్థాయిలో బయటకు తీసుకురాలేకపోయినప్పటికీ.. దానిని ఇరుపైపులా వేస్తూ లోకో, జేసీబీ ఎర్త్‌మూవర్లు వెళ్లడానికి మార్గం చేస్తున్నారు. ప్రస్తుతం లోకో దాదాపు 13.5 కిలోమీటర్ వద్దకు వెళ్లగలుగుతుంది. నీరు పేరుకుపోకుండా డీవాటరింగ్ సమర్థవంతంగా జరుగుతుండటంతో సహాయక చర్యలు బాగా నడుస్తున్నాయి.

లోకో ట్రెయినే కీలకం...:



సహాయక సిబ్బందితో టన్నెల్ లోపలికి వెళ్తున్న లోకో ట్రైన్

టన్నెల్‌లో సాధారణ వాహనాలు తిరిగే అవకాశం లేదు. కార్మికులు, ఇంజనీర్లు లోపలకు వెళ్లి రావడానికి వేరే మార్గాలు కూడా లేవు. కేవలం ఏ దారి నుంచి వెళ్తున్నామో.. అదే దారి నుంచి బయటకు రావాలి. అందుకే జర్మనీ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన లోకో ట్రెయిన్లను కార్మికులు, వస్తువుల రవాణాకు వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసి లోకో షెడ్లు కూడా ఉన్నాయి. నాలుగు ఇంజన్ల వరకు ఉండగా.. వాటి ద్వారానే ఇప్పుడు సహాయక చర్యలు కూడా కొనసాగుతున్నాయి. అయితే లోపలకు వెళ్లి వచ్చేందుకు దాదాపు 3 గంటలకు పైగా సమయం తీసుకుంటుంది.

క్రైం కార్నర్

రైలులో నుంచి జారి పడి వ్యక్తి మృతి

గద్వాల క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైలులో నుంచి జారిపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలో సోమవారం రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గద్వాల, శ్రీరాంనగర్ స్టేషన్ల మధ్య కిలోమీటరు నెంబర్ 184 సమీపంలో ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎవరికైనా ఆనవాలు తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి

వడ్డేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లోని జములమ్మ ఆలయం వద్దనున్న బావిలో ఓ వ్యక్తి జారి పడి మృతి చెందాడు. మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన మద్దిలేటి (36) అనే వ్యక్తి మంగళవారం జములమ్మ దేవరకు వచ్చాడు. ఆలయ సమీపంలోని బావి వద్ద కాళ్లు కడుక్కొంటూ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. ఈ మేరకు అతడి సోదరుడు భీముడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

బొలేరో బోల్తా

» 10 మంది కూలీలకు గాయాలు



కిష్టాపూర్ సమీపంలో బోల్తాపడిన కూలీల బొలేరో వాహనం

అయిజ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని కిష్టాపూర్ సమీపంలో కూలీలు వెళ్తున్న బొలెరో వాహనం బోల్తాపడటంతో 10 మంది గాయపడ్డారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజోళి మండలం నసనూరు, చిన్నదన్వాడ గ్రామాలకు చెందిన 30 మంది కూలీలు మంగళవారం ఉదయం బొలెరో వాహనంలో ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామంలో మిరప తీసేందుకు వెళ్లారు. పని ముగించుకొని సాయంత్రం తిరిగి వస్తుండగా కిష్టాపూర్ సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో 10 మంది కూలీలు గాయపడ్డారు. వారిని గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ సురేశ్ వాహనాన్ని వేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని కూలీలు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జడ్చర్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని శ్రీనివాసకాలనీలో గడ్డివాము దగ్ధం దగ్ధమైంది. పట్టణానికి చెందిన రైతు సంజీవ పశువుల మేత కోసం లక్ష రూపాయలు వెచ్చించి 6 ట్రాక్టర్ల గడ్డిని కొనుగోలు చేసి, కాలనీలో నిల్వ ఉంచుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గడ్డివామికి నిప్పంటుకుంది. గమనించి రైతు సంజీవతో పాటు పరిసర ప్రాంత ప్రజలు గమనించి అప్రమత్తమయ్యారు. మంటలను ఆర్పేందుకు యత్నిస్తూనే, ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ రాజేందర్, ఫైర్‌మన్లు లక్ష్మీకాంత్‌రెడ్డి, మల్లిఖార్జున్ ఫైర్‌ఇంజన్‌తో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

» వివాహ వేడుకల్లో గొడవే కారణం

ఖిల్లాఘణపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై ఇద్దరు దాడి చేశారు. ఏఎస్‌ఐ వెంకట నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పానుగంటి శేఖర్ ఈ నెల 9న గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లాడు. పందిరిలో సాక కార్యక్రమం నిర్వహిస్తుండగా, అతడి వరుసకు సోదరుడు పానుగంటి బంగారం సాక పోయాల్సింది నేనంటూ అతడితో గొడవకు దిగాడు. మండపం బయటకు లాక్కెళ్లి కర్రతో దాడి చేయడంతో శేఖర్ కుడి కన్నుపై గాయమైంది. మరుసటి రోజు గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద కాశీపురం జగన్, పానుగంటి ఆంజనేయులు అనే వ్యక్తులు శేఖర్‌పై దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్‌ఐ వెంకటనాగరాజు తెలిపారు.

డీసీఎం బోల్తా, 1,450 కోళ్లు మృతి

» ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్



ప్రమాదానికి గురైన డీసీఎం

కృష్ణ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఫారం కోళ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం బోల్తా పడటంతో, 1,450 కోళ్లు మృతి చెందాయి. నారాయణపేట జిల్లా, కృష్ణ మం డల పరిధిలోని కుస్నీ గ్రామ శివారులో మంగళ వారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. స్థానిక లు తెలిపిన వివరాల ప్రకారం... 167వ నెంబర్ జాతీయ రహదారిపై జడ్చర్ల నుంచి మంత్రాలయం వైపు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని కృష్ణ సరిహద్దులోని చెక్ పోస్టు వద్ద అధికారులు నిలిపేశారు. వెనుదిరిగి వెళ్లాలని చెప్పడంతో టైరోడ్డు మీదుగా 150 నెంబర్ జాతీయ రహదారి మీదుగా కర్ణాటకకు బయలుదేరాడు. కృష్ణ మండ లంలోని కుస్నీ సమీపంలోని జైనమందిరం వద్ద వాహనం బోల్లాపడింది. ప్రమాదంలో డ్రైవర్ ఫజల్ ఎడమ విరిగింది. అతడిని చికిత్స కోసం కర్ణా టక రాష్ట్రం రాయిచూరుకు తీసుకెళ్లారు. వాహనంలోని 1,450 కోళ్లు చని పోయాయి. వాటిని స్థానికుల సాయంతో గుంత తవ్వి పూడ్చివేశారు.

ఘర్షణ కేసులో తొమ్మిది మందికి జైలు

జడ్చర్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : దాయాదుల మధ్య జరిగిన ఘర్షణ కేసులో తొమ్మిది మందికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. కేసుకు సంబంధించిన వివరాలను జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టారం గ్రామానికి చెందిన పొన్నకంటిరాములు, యశోద, కేశవులు, పద్మలపై వారి దాయాదులు పొన్నకంటి వెంకటయ్య, మహేందర్, సురేందర్, హరేందర్, లక్ష్మన్న, మానస, లక్ష్మమ్మ, సరోజ, రాజులు దాడి చేశారు. బాధితుడు పొన్న కంటి రాములు ఫిర్యాదు మేరకు, 2017 అక్టోబర్‌లో కేసు నమోదు అ య్యింది. అప్పటి ఎస్‌ఐ లక్ష్మీనర్సింహులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం చార్జ్‌షీటు దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీపిక వాద నలతో జడ్చర్ల అదనపు కోర్టు న్యాయాధికారి ముద్దాసిర్ ఏకీభవించారు. నిందితులు పొన్నకంటి వెంకటయ్య, మహేందర్, సురేందర్, హరేందర్, లక్ష్మన్న, మానస, లక్ష్మమ్మ, సరోజ, రాజులకు మూడు నెలల జైలుశిక్షతో పాటు రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

సర్కార్ బడిలో.. ఏఐ పాఠాలు

» నారాయణపేట జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం
» విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత బోధన
» ఎంపిక చేసిన పది పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
» నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక చర్యలు





నారాయణపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇటీవల విద్యాస్థితి-2024 (అసర్) నివేదిక విడుదలైంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంతకు ముందు ఏడాదికంటే గణనీయంగా పడిపోయినట్లు వెల్లడైంది. దీంతో ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కార్యాచరణ సిద్ధం చేసింది. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద నారాయణపేట జిల్లాలో 10 పాఠశాలలను ఎంపిక చేసింది. వాటిల్లో 3, 4, 5 తరగతుల్లో వెనుకబడిన 114 మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ఆధారిత విద్యాబోధన చేస్తున్నారు. చతుర్విధ పద్ధతుల్లో (కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం) నైపుణ్యాల మెరుగునకు కృషి చేస్తున్నారు. దీంతో పాటు చదవడం, మాట్లాడటంపై శిక్షణ ఇస్తున్నారు. అందు కోసం ఆ పాఠశాలల్లో ఫౌండేషనల్ ఆఫ్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్ఏ) ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌లను గత నెల 24న ప్రారంభిం చారు. విద్యా ర్థులకు సు లభ శైలిలో అర్థ అ యో ్య లా డిజిటల్ విద్యాబోధన చేస్తున్నారు.



ఏఐ ఆధారిత డిజిట్ తరగతులు వింటున్న విద్యార్థులు

45 నిమిషాల పాటు బోధన

ఏఐ ఆధారిత విద్యాబోధన కోసం నారాయణపేట జిల్లాలో మొత్తం 10 పాఠశాలలను ఎంపిక చేశారు. వాటిలో ముడుమాల్, గుడెబల్లూరు, కర్ని, నారాయణ పేటలోని శివాజీనగర్, కొల్లంపల్లి, కంసాన్‌పల్లి, పల్లెర్ల, నిడ్జింత, గుండుమాల్, నాచారం ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు వారానికి రెండు రోజుల పాటు 45 నిమి షాలు ఏఐ ఆధారిత విద్యాబోధన చేస్తున్నారు. తెలుగు, గణితం, ఇంగ్లిష్ పదాలను సులభ శైలిలో నేర్పిస్తున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ స్క్రీన్‌పై ఉన్న పదాన్ని విద్యార్థి కరెక్టుగా చదివితే ఆకుపచ్చ రంగు, తప్పు అయితే ఎరుపు రంగులోకి మారుతుంది. ఇలా మొత్తం 10 పదాలు చదివిన తర్వాత అన్నీ కరెక్టుగా ఉంటే 'సక్సెస్‌ఫుల్' అని మెసేజ్ వస్తుంది. అలాగే వివిధ ప్రాంతాలు, పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాలకు సంబంధించిన ప్రశ్నలకు విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతుంది. మొత్తంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడం, వారిలో నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా విద్యాబోధన చేస్తున్నారు.

'ఎక్ స్టెప్'తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

పాఠశాలల్లో అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టు పర్యవేక్షణకోసం బెంగళూర్‌కు చెందిన ఎక్ స్టెప్ ఫౌండేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. ఇప్పటికే ఈ సంస్థ అధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలు సాధించింది. అదే స్ఫూర్తితో కార్యక్రమం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నారాయణపేట జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించింది. ఎంపిక చేసిన 10 పాఠశాలల్లో ఏఐ పాఠాలు బోధించేందుకు కంప్యూటర్లను ఏర్పాటు చేసి, ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించింది. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ఇటీవల జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు.

విద్యార్థులకు ఉపయోగం

తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులకు ఏఐ ఆధారంగా అభ్యసనం ఎంతగానో ఉపయోగ పడుతుంది. పది మంది విద్యార్థుల చొప్పున మూడు షిఫ్టులలో బోధన జరిగేలా చూస్తున్నారు. దీనివల్ల వారికి కంప్యూటర్‌పై అవగాహన కలగడంతో పాటు విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. వెనుకబడిన విద్యార్థులకే కాకుండా అందరికీ కంప్యూటర్ బోధన జరిగితే మరింత మేలు చేకూరుతుంది.

బాల్‌రాజ్ నాయక్, హెచ్ఎం, శివాజీనగర్, ప్రభుత్వ పాఠశాల, నారాయణపేట.



మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

» వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. 'మానవ హక్కుల పరిరక్షణ - బాధ్యత'పై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తరుణి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను కాపాడాలన్నారు. జాతి, లింగం, మతం, భాషలతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరికి జన్మతః సంక్రమించే హక్కులుగా భావించాలన్నారు. అందుకోసం 2019లో ప్రభుత్వం మానవహక్కుల పరిరక్షణ బిల్లును తీసుకొచ్చిందన్నారు. బానిసత్వం, హింసల నుంచి స్వేచ్ఛ, అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛ, పని, విద్యా హక్కులు, సమానత్వం, న్యాయం కోసం పోరాడటమే మానవహక్కుల పరిరక్షణగా భావించాలని తెలిపారు. విద్యాలయాలు అంటే చదవడం, రాయడం నేర్పే స్థలం మాత్రమే కాదన్నారు. సమగ్ర అనుభవానికి సంబంధించిన విషయాలను, నైపుణ్యాలను నేర్పేదే విద్యాలయం అని భావించాలని చెప్పారు. పాఠ్యాంశాలతో పాటు సమాజ పరిణామాలను గ్రహించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి కొమ్ము అగిరప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణ్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోచయ్య, రాష్ట్ర కార్యదర్శి జీటీ శ్యామ్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు విశ్వం బాబు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్ల శైలన్‌కుమార్, ప్రెస్ సెక్రటరీ శివకుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు కొట్ర బాలు, సామాజిక కార్యకర్త గంధం నాగరాజు, ఆర్డీఎస్ ఎన్జీవో నిర్వాహకులు చిన్నమ్మ థామస్, సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత, జిల్లా జెండర్ స్పెషలిస్టులు శ్రీవాణి, సలోమి, చిత్రకారుడు జీటీ కృష్ణ పాల్గొన్నారు.

అమరచింతకు రాముల వారి తలంబ్రాలు



భద్రాచలం తలంబ్రాలను అమరచింత ఆర్యవైశ్య మహిళలకు అందజేస్తున్న దృశ్యం

అమరచింత, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాముల వారి కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాల వడ్లు మంగళవారం అమరచింతకు చేరాయి. శ్రీరామ నవమి రోజు భద్రాచలంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి ఉపయోగించే వరి గింజలను వలచి శుద్ధి చేసేందుకు అమరచింత ఆర్యవైశ్య మహిళలకు శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపకుడు పూరి సురేష్ శెట్టి 20 ప్యాకెట్ల వడ్లను అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్ శెట్టి మాట్లాడుతూ... భద్రాచలంలోని సీతారాముల కల్యాణ తలంబ్రాలను తమ చేతుల మీదుగా వలిచి శుద్ధి చేసే అవకాశం రావడం అదృష్టమని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ వాసవీ సేవా సమితి మండల అధ్యక్షురాలు శ్రావణి, రామ్మోహన్, జయశ్రీ, వీరేశం, సరళ, మాధవి, ఉమ, బాల కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

» 8 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు
» జడ్చర్ల పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఘటన
» జోగుళాంబ గద్వాల జిల్లాలో మరో ఘటన



జడ్చర్ల పట్టణంలోని సాయినగర్‌కాలనీలోగల మల్లిఖార్జున్‌యాదవ్ ఇంట్లోని బీరువాలో చిందరవందరగా పడిన దుస్తులు

జడ్చర్ల/ గద్వాల క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీ, సాయినగర్ కాలనీలోని రెండు ఇళ్లల్లో సోమవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఓ ఇంట్లో 8 బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన మల్లిఖార్జున్‌యాదవ్ జడ్చర్ల పట్టణంలోని సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి సొంతపనిపై లింగంపేటకు వెళ్లాడు. మంగళవారం ఉదయం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులోని 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఇంట్లో ఎలాంటి వస్తువులూ పోలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సీసీ కెమెరాల్లో కనిపిస్తున్న దొంగ ఆనవాళ్లు

మూడు ఇళ్లలో చోరీకి యత్నం

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాతహౌసింగ్ బోర్డులో సోమవారం అర్ధరాత్రి ఓ దొంగ మూడు ఇళ్లలో చోరీకి యత్నించాడు. అంతకుముందు ఓ టీకొట్లో సిగరెట్లను ఎత్తుకెళ్లాడు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని పాతహౌసింగ్ బోర్డు కాలనీలోని టీకొట్లో సోమవారం అర్ధరాత్రి ఓ దొంగ ప్రవేశించాడు. రూ. 7 వేల విలువైన సిగరెట్లను చోరీ చేశాడు. తర్వాత సమీపంలోని సూరిబాబు ఇంటి ప్రహరీ దూకాడు. ఆ ఇంటి వారు కేకలు వేయడంతో పక్కనే ఉన్న పచ్చిపులుసు వెంకటేశ్వర్లు ఇంటి గోడ దూకాడు. వారు కూడా అరవడంతో ఆ పక్కనే ఉన్న విక్రమసింహారెడ్డి ఇంటి ప్రహరీ దూకాడు. దీంతో అందరూ కేకలు వేయడంతో పారి పోయాడు. ఈ విషయంపై పచ్చిపులుసు వెంకటేశ్వర్లు 100 నెంబర్‌కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. టీకొట్లో దొంగకు సంబంధించిన షూ దొరికింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా దొంగలను గుర్తిస్తామని తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

» ఐదవ రోజు ప్రశాంతం



గద్వాల జూనియర్ కళాశాలలోకి వెళ్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ నారాయణ పేట/ గద్వాల సర్కిల్/ నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఐదవ రోజు మంగళవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం మ్యాథ్స్-1ఏ, బాటనీ, పొలిటికల్ సైన్స్ బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, ప్రిన్సిపల్స్ ఆఫ్ అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజ నీరింగ్ పరీక్షలు నిర్వహించారు.

- మహబూబ్‌నగర్ జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలున్నాయి. మొత్తం 12,016 మంది మొదటి సంవత్సరం పరీక్షలు రాయాల్సి ఉండగా, మంగళవారం 11,690 మంది రాశారు. 326 మంది పరీక్ష రాయలేదు. నారాయణపేట జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలున్నాయి.
- నారాయణపేట జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలున్నాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4,975 మందికి గాను, 4,810 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 165 మంది గైర్హాజరయ్యారు. వారిలో జనరల్ విద్యార్థులు 4,383 మందికి గాను 4239 మంది పరీక్ష రాశారు. 144 మంది రాయలేదు. ఒకేషనల్‌లో 592 మందికి గాను 571 మంది పరీక్షలు రాయగా, 21 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్‌రావు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో
- జోగుళాంబ జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాల్లో 4,627 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 4,425 (95.6 శాతం) మంది హాజరైనట్లు ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు తెలిపారు. వారిలో జనరల్ 3,784 విద్యార్థులకు 3,632 (96 శాతం) మంది, వృత్తి విద్య 843 విద్యార్థులకు గాను 793 (94 శాతం) మంది విద్యార్థులు పరీక్ష రాశారు. గట్టు, ధరూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,528 మంది విద్యార్థులకు గాను 7,076 మంది హాజరు కాగా, 452 మంది గైర్హాజరయ్యారు. వారిలో జనరల్ విద్యార్థులు 5,830 మందికి గాను 5,499 మంది పరీక్ష రాశారు. 331 రాయలేదు. ఒకేషనల్‌లో 1,698 మంది విద్యార్థులకు గాను 1,577 మంది హాజరు కాగా, 121 మంది గైర్హాజరయ్యారు.
- వనపర్తి జిల్లాలో జనరల్ విభాగంలో 6,190 మంది విద్యార్థులకు గాను, 5,969 మంది పరీక్షలకు హాజరయ్యారు. 221 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. ఒకేషనల్‌లో 849 మందికి గాను, 798 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 51 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 7,039 మందికి గాను, 6,767 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 272 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన గుడ్లు



వటువర్లపల్లి అంగన్వాడి కేంద్రంలో ఇచ్చిన గుడ్లు



కుళ్లిపోయిన గుడ్డులో కనిపించిన పురుగులు

దోమలపెంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అంగన్ కేంద్రం లో చిన్నారులకు పంపిణీ చేసే గుడ్లు కుళ్లిపోయి ఉండటంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అ మ్రాబాద్ మండలం, వటువర్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నా రులకు రెండు రోజుల క్రితం ఇచ్చిన గుడ్లు కుళ్లిపోయి ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో రెండు రోజుల క్రితం తమ కుమార్తెకు 12 గుడ్లు ఇచ్చారని, అవి కుళ్లిపోయి ఉన్నాయి వార్డు మాజీ సభ్యుడు ఎనపోతుల భరత్‌కుమార్ తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అంగన్ వాడీ వర్కర్ పార్వతమ్మ మాట్లాడుతూ ఏజెన్సీ వారు సరఫరా చేసిన గుడ్లనే చిన్నారులకు ఇచ్చినట్లు తెలిపారు. సూపర్‌వైజర్ పద్మ స్పందిస్తూ గత నెల 20న అమ్రాబాద్ మండల వ్యాప్తంగా గుడ్లను సర ఫరా చేసినట్లు తెలిపారు. వాటిని 15 రోజుల్లోగా బాలింతలు, చిన్నా రులకు పంపిణీ చేయాల్సి ఉంటుం దన్నారు. వటువర్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేసి, అధికారులకు నివేదిక పంపిస్తానని చెప్పారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వం ద్వారా కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా పరిషత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ భవనాలు, పాఠశాలల నిర్మాణం, మరమ్మతులు, అంగన్‌వాడీ భవనాల్లో మౌలిక సదుపాయాలు తదితర పనుల పురోగతిపై పంచాయతీ రాజ్, ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వచ్చిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపు ఖర్చు చేయాలని సూచించారు. జిల్లాలోని కేజీబీవీ సంక్షేమ పాఠశాలలో చేపడుతున్న మరమ్మతులు, మౌలిక సదుపాయాల పనులపై సమీక్ష నిర్వహించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధింత ఇంజినీర్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య, పీడీఆర్‌డీవో ఉమాదేవి, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజినీరు మల్లయ్య, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కచ్చా లేఅవుట్ ప్లాట్లను కొనుగోలు చేయొద్దు

కచ్చా లే అవుట్ ప్లాట్లను ఎవరూ కొనుగోలు చేయవద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఎల్ఆర్ఎస్ లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణపై మంగళవారం మునిసిపల్ కమిషనర్లు, లైసెన్స్‌డ్ టైన్ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ ఇంజినీర్లతో ఎల్ఆర్ఎస్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. 2020 తరువాత కచ్చా లేఅవుట్ చేసిన వారు, వాటిలో ప్లాట్‌లు తీసుకున్న వారు జిల్లాలో 29వేల మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జిల్లాలోని 5 మునిసిపాలిటీల ద్వారా దాదాపు 25 వేల మందికి నోటీసులు జారీ చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో క్రమబద్ధీకరణ జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు కట్టిన ప్లాటు యజమానులకు కలెక్టర్ క్రమబద్ధీకరణ ఉత్తర్వు కాపీలను అందజేశారు.

ఇంటర్వ్యూ

వంద రోజుల పని దినాలు పూర్తి చేయాలి

- ఏపీవో నరసింహ



రేవల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలందరూ వంద రోజుల పని దినాలను పూర్తి చేయాలని ఏపీవో నరసింహ మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి. యాక్టివేషన్‌లో ఉన్నవి ఎన్ని?

మండలంలో 6,385 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 2,166 కార్డులు యాక్టివేషన్‌లో ఉన్నాయి.

జాబ్‌కార్డులు ఎంత మందికి ఉన్నాయి.? అందులో పని చేసే వారు ఎంత మంది ఉన్నారు.?

మొత్తం 12,042 మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 3,087 మంది పనిచేశారు. 93 శాతం పని దినాలు చేశారు.

ఉపాధిహామీలో చేసిన పని ఎంత?

ఇప్పటి వరకు మూడు కోట్ల 51 లక్షల పని చేయగా ఇందులో మెటీరియల్‌కు ఒక కోటి 27 లక్షలు, కూలీలకు రెండు కోట్ల 20 లక్షలు అయింది.

వంద రోజులు పని పూర్తి చేసిన వారు ఉన్నారా?

వంద రోజులు పని పూర్తి చేసిన జాబ్ కార్డులు 37 మంది ఉన్నారు. ఒక జాబ్‌కార్డుకు యావరేజ్‌గా 43 శాతం ఉంది.

మీ పరిధిలో జరిగే పనులేవి?

గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు సెగ్రిగేషన్ షెడ్లు, ఎనర్జీ ఎస్సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, నర్సరీలు, ప్రకృతి వనాలు, పశువుల షెడ్లు, ఇప్పుడు గుంతలు, పంట కల్లాలు, పామ్‌పాండ్స్ గుంతలు, ఇవన్ని మా పరిధిలోనే కొనసాగుతాయి.

అన్ని గ్రామాల్లో ఇవి ఏర్పాటు చేశారా?

క్రీడా ప్రాంగణాలు, ప్రకృతి వనాలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేశాం. పశువుల షెడ్లు 12, పంట కల్లాలు 10 కొన్ని గ్రామాల్లోనే ఉన్నాయి.

రైతులు తోటలు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారా?

ఈ మధ్య కాలంలో ఆసక్తి చూపిస్తున్నారు. ఈ సంవత్సరంలో పది ఎకరాలు ఆయిల్ పామ్, 38 ఎకరాలు ఇతర తోటలు రైతులు పెట్టారు.

ఈ పనులను ఉన్నతాధికారులు పరిశీలిస్తారా?

తప్పనిసరిగా పరిశీలిస్తారు. మా పై స్థాయి నుంచి కలెక్టర్ స్థాయి వరకు అందరూ క్షేత్ర స్థాయిలో వచ్చి పరిశీలిస్తారు.

న్యూస్ బాక్స్

బీజేపీ నాయకుల నిరసన



శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కొత్తకోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి అక్టోబరు 2023లో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వేసిన శిలాఫలకం వద్ద బీజేపీ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5 కోట్ల 75 లక్షలు మంజూరు చేసిందని, భూమి పూజ నిర్వహించి ఏడాది ముగిసినా.. పనులు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయానికి వచ్చి కమిషనర్ సైదయ్యకు వినతి పత్రం అందజేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, భరత్ భూషణ్, వెంకట్‌రెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, బాలస్వామి, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలపై అప్రమత్తంగా ఉండాలి

గోపాల్‌పేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆన్‌లైన్ సేవలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ ఆఫీసర్ మణికంఠ అజయ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టైనిటూఈస్ పాఠశాలలో బ్యాంకింగ్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకు అందించే లావాదేవీలను విద్యార్థులకు వివరించారు.

ఖిల్లా మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

ఖిల్లాఘణపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఖిల్లాఘణపురం మాజీ సర్పంచ్ బండారి లక్ష్మయ్య ఈ నెల 9న మృతి చెందడంతో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆధ్వర్యంలో బండారు లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సర్పంచ్‌గా ఖిల్లాఘణపురానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. మాజీ సర్పంచ్ బండారి లక్ష్మయ్య కుమారుడు బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్‌ను మహబూబ్ నగర్‌లోని వారి స్వగృహంలో పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు బుడ్డన్న, బుచ్చిబాబు గౌడ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రేవల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎమ్మనబెట్ల నుంచి రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామం మీదుగా నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లికి ఇసుక తరలిస్తుండగా.. పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఒక ట్రాక్టర్‌ను బండరాయిపాకుల చౌరస్తా వద్ద, మరొక ట్రాక్టర్‌ను నాగపూర్ గ్రామ చౌరస్తా వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

సైబర్ నేరస్థుల ప్రలోభాలకు గురికావొద్దు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, సదస్సులో మాట్లాడుతున్న రజిని

వనపర్తి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అత్యాశకు వెళ్లి సైబర్ నేరస్థుల ప్రలోభానికి గురికావొద్దని సీనియర్ న్యాయాధికారి రజిని అన్నారు. మంగళవారం వనపర్తిలోని ప్రధానమంత్రి కౌశల్ యోజన కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటున్న విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు అర్జించాలనే మన అత్యాశను సైబర్ నేరగాళ్లు లాభాలుగా మార్చుకుంటారని అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ పని తీరు గురించి, ఏ విధంగా సంస్థ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తుందో తెలియజేశారు. కార్యక్రమంలో కేంద్రం మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి భరోసా



వంట సామగ్రిని పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

పెద్దమందడి, మార్చి 11, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అల్వాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె కాలిపోయి వీధిన పడిన కుటుంబానికి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున వారికి మనోధైర్యం కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఆలే శ్రీనివాసులు కిరాణం సరుకులు, వంట సామగ్రి, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ వారు రూ.5 వేల విలువ చేసే వంట సామగ్రి బియ్యం, పప్పు, సబ్బులు, నూనెలు, వంట పాత్రలు, దుస్తులు, దుప్పట్లు అందజేశారు. పెద్దమందడి ఎస్ఐ యుగంధర్‌రెడ్డి 50 కిలోల బియ్యం అందజేశారు. తహసీల్దార్ సరస్వతీ, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు అహ్మద్, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ రాజేందర్, మహేష్, సువర్ణ, జగన్మోహన్‌రెడ్డి, అల్వాల గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

పాన్‌గల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్నారం తండాకు చెందిన సభీబాయి భర్త జగన్ నాయక్‌కు రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో రేఖ్యా నాయక్, రాత్లావత్ గోపాల్ నాయక్, ప్రేమ్ నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెబ్బేరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలైన సంఘటన పెబ్బేరు జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ కేంద్రంలోని మారెమ్మకుంటకు చెందిన రాఘవేందర్ ఎర్రవల్లి చౌరస్తాకు ఆటోలో వెళ్తుండగా.. వెనకాల నుంచి ట్రక్కు వచ్చి ఢీ కొట్టింది. దీంతో అతనికి కాలు విరగడంతో పాటు నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



నరసింహారెడ్డి(ఫైల్)

చిన్నంబావి మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొప్పునూర్‌లో నరసింహారెడ్డి (56) మంగళవారం తెల్లవారు జామున పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలియజేశారు.

నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలి

పెబ్బేరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని, వాటి నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని రాష్ట్ర బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మంగళవారం పెబ్బేరు పట్టణంలో మార్నింగ్ వాక్ చేపట్టి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. కిష్టారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరైన భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేయాలన్నారు. చెల్లిమిల్లలో కల్లుదుకాణం సమస్యలను పరిష్కరించాలని గౌడ కులస్థులు కోరారు. రాష్ట్ర కార్యదర్శి వివిగౌడ్, జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య యాదవ్, నాయకులు రాఘవేంద్రగౌడు, నర్సింహయాదవ్, అంజన్న యాదవ్ పాల్గొన్నారు.



కిష్టారెడ్డిపేట పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాచాల యుగేందర్‌గౌడ్

వెంచర్లలో రాళ్ల తొలగింపు



రాళ్లను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

కొత్తకోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అనుమతి లేని వెంచర్లకు ప్రభుత్వం క్రమబద్ధీకరణకు సమయం ఇచ్చినా.. సద్వినియోగం చేసుకోకపోవడంపై అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం చర్యలు చేపట్టారు. లే అవుట్, ప్లాట్లు యజమానులకు ప్రభుత్వం ఇచ్చిన గడువు ప్రకారంగా.. డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలని ఆటో ద్వారా పట్టణంలో ప్రచారం చేయడం జరిగిందని కమిషనర్ సైదయ్య తెలిపారు. కొందరు నిర్లక్ష్యం చేయడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు 4వ వార్డులోని వెంచర్‌లో ప్లాట్ల రాళ్లను మునిసిపల్ సిబ్బంది తొలగించడం జరిగిందని చెప్పారు. క్రమబద్ధీకరణ లేని వెంచర్లు, ప్లాట్ల యజమానులు ఇప్పటికైనా ముందుకు రాకుంటే రాళ్ల తొలగించిన ఖర్చులు వారితోనే వసూలు చేస్తామని హెచ్చరించారు.

అనుమతులు లేకుంటే చర్యలు

ఆత్మకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డు పరిసర ప్రాంతంలోని శిరిడి సాయి కాలనీ పక్కన 272 సర్వే నెంబర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన రాళ్లను మంగళవారం తొలగించారు.

వ్యవసాయ పద్ధతులపై రైతులకు సూచనలు

పాన్‌గల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వివిధ పంటలపై మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలతో మంగళవారం సూచనలు, సలహాలు ఇస్తున్నారని మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి పంట పద్ధతులు, వరి పంట పద్ధతులకు సంబంధించి సూచనలు ఇస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులకు సూచనలు చేశారు. రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సీసీ కెమెరాల ఏర్పాటుకు దేవరపల్లి గ్రామస్థులు ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్‌లకు రూ.లక్ష ఇరవై వేల ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. వారం రోజుల కిందట సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేందర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించడంతో గ్రామ పెద్దలు చందాలు వసూలు చేసి అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం ఎనిమిది సీసీ కెమెరాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరపల్లి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

ఖిల్లాఘణపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన లక్ష్మి, ఆమె అక్క నాగమ్మపై దాడి చేసిన రాములు, మహేష్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన లక్ష్మి తన తండ్రి బాలయ్య ఇంటి స్థలంలో కిరాణ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమయంలో ఆమె బంధువులైన రాములు, మహేష్ దుకాణాన్ని ధ్వంసం చేశారు. బాధితురాలు ఈ విషయంపై ప్రశ్నించినప్పుడు ఆమెపై రాములు, మహేష్ దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలి



డీడబ్ల్యూవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

వనపర్తి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మార్చి 17, 18వ తేదీల్లో 48 గంటల సమ్మె (వంటావార్పు) వనపర్తిలో నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని డీడబ్ల్యూవో కార్యాలయంలో డీడబ్ల్యూవో సుధారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఐసీడీఎస్ సేవలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని అమలు చేసే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, బీఎల్‌వో డ్యూటీలు రద్దు చేయాలని, ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులు చేయించకూడదని అన్నారు. గతంలో చేసిన 24 రోజుల సమ్మె వేతనం వెంటనే చెల్లించాలని, అంగన్‌వాడీలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నింటిని అమలు చేయాలని అన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, నాగేంద్రమ్మ, రాజేశ్వరి, సంగీత, భారతి, రేణుక, శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల గుర్తింపు

- మొబైల్ యాప్‌లో నమోదు



ఖిల్లాఘణపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనను సమీక్షిస్తున్న ఎంఈవో

ఖిల్లాఘణపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థుల గణితం, తెలుగు, ఆంగ్లం సామర్థ్యాలను తెలంగాణ విద్య పరిశోధన శిక్షణ మండలి వారు ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్ సర్వేయర్ల ద్వారా మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారని ఎంఈవో జయశంకర్ తెలిపారు. మండలంలోని మల్కాపూర్, మానాజీపేటలోని ప్రాథమిక పాఠశాల, హరిజనవాడ పాఠశాల, మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థుల గణితం సామర్థ్యాలను మంగళవారం ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్ సర్వేయర్లు పరిశీలించారు. విద్యార్థులకు అంకెలు, చిన్న, పెద్ద సంఖ్యలు, మిస్సింగ్ నెంబర్స్, కూడిక, తీసివేతలకు సంబంధించిన అంశాలను విద్యార్థుల స్పందనను బట్టి మొబైల్ యాప్‌లో కరెక్టు, ఇన్ కరెక్టు, నో రెస్పాన్స్ అనే ఆప్షన్‌తో 11 అంశాలపై సర్వే ప్రతినిధులు సమాధానాలు పూరించారు. తెలుగులో వర్ణమాల, అక్షరాలు, పదాలు, వాక్య నిర్మాణం లాంటి అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆంగ్లంలో చిత్రాలపై ప్రశ్నలు, ఆల్ఫాబెట్స్, నిర్ణీత సమయంలో అక్షరాల గుర్తింపులను మదింపు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన సరళిని ఎంఈవో జయశంకర్ సమీక్షించారు. ప్రధానోపాధ్యాయులు ఫరీద్, ట్రైనీ ఇన్వెస్టిగేషన్ సర్వేయర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఆత్మకూరులో చెక్కులు అందజేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ కల్లు విభాగం చైర్మన్ నాగరాజు గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే అమరచింత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 28 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేసి అనంతరం మస్తీపూర్‌లో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి అన్ని హామీలను పూర్తి చేస్తూ.. వస్తున్నారని అన్నారు. తహసీల్దార్ రవికుమార్, నాగరాజు గౌడ్, శ్రీనివాసులు, రవి బాబు, నరసింహయ్య, పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం

ఆత్మకూరు : అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు.

మునిసిపాలిటీలో ఎస్సీకి సీట్లు కేటాయించాలి

ఆత్మకూరు మునిసిపాలిటీ కేంద్రంలో రెండు ఎస్సీ కౌన్సిలర్ రిజర్వ్ సీట్లను కేటాయించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ఎస్సీ యువకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ యువకులు కృష్ణ మాదిగ, గాలిపంపు శ్రీనివాస్, బుచ్చన్నతో పాటు పలువురు పాల్గొన్నారు.

చంద్రఘడ్ లిఫ్టు పరిశీలన

అమరచింత, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చంద్రఘడ్ ఎత్తిపోతల పథకాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరిశీలించారు. రూ.25 లక్షల వ్యయంతో చంద్రఘడ్ లిఫ్టు మోటార్లు, ఎత్తిపోతల పథకం మరమ్మతు అనంతరం రైతులకు సాగునీటిని విడుదల చేశారు. ఈ మేరకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే లిఫ్టు పని తీరు, రైతులకు అందుతున్న సాగునీటి వివరాలను రాష్ట్ర కాంగ్రెస్ కల్లు విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల పథకాన్ని రైతులు సమన్వయంతో అందరి భాగస్వామ్యంతో విజయవంతంగా నడుపుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేతో పాటు నాగరాజు గౌడ్, ఆశిరెడ్డి, మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ధర్మాపూర్‌లో వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అమరచింత, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ మాట్లాడారు. ధర్మాపూర్‌లోని ప్రజలకు మౌలిక వసతులు ఏమాత్రం కల్పించలేదని విమర్శించారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అజయ్, శంకర్, రాజు, మోహన్, మన్యం, బాలు, రాములు, చంద్రాయుడు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ ద్వారా తమ ప్రాపర్టీని ఇది వరకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు సబ్ రిజిస్టర్ ప్రకాష్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని రిజిస్టర్ కార్యాలయంలో డాక్యుమెంటరీ రైటర్స్, స్టాంప్ వెండర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులు తమ ప్రాపర్టీని రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న క్రమంలో ప్రాపర్టీ విలువ ఆధారంగా 25 శాతం రాయితీని పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. అలాగే నూతనంగా రిజిస్ట్రేషన్ చేసుకునే లబ్ధిదారులు కూడా 25 శాతాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. డాక్యుమెంటరీ స్టాంప్‌వెండర్స్ పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

గోపాల్‌పేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు ఎస్ఐ నరేష్ కుమార్ సెల్‌ఫోన్ అందజేశారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులకు సెల్‌ఫోన్లు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన నల్లపోతు రాము, వనపర్తికి చెందిన రమేష్ కొన్ని రోజుల కిందట సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీస్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బాధితులకు తిరిగి తమ సెల్‌ఫోన్‌లను అందజేశారు. ప్రజలు సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

వీపనగండ్ల, మార్చి 11, (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి డి.బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ప్రదేశానికి సీపీఎం బృందం వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉపాధి కూలీలకు రోజు వారీగా రూ.100 నుంచి రూ.150 అందుతుందన్నారు. 200 రోజుల పని దినాలు కల్పించాలని, రూ.500 కూలీ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూరాల, బీమా లింకు కెనాల్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ నాయకులు ఆశన్న, ఈశ్వర్, నరసింహ, రామకృష్ణ, రఘు పాల్గొన్నారు.